

నేడు పిజిఆర్ఎస్ రద్దు : కలెక్టర్



ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద, జిల్లాలోని అన్ని డివిజన్, మున్సిపల్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో జరుగు పిజిఆర్ఎస్ కార్యక్రమం ఈనెల 17న తాత్కాలికంగా రద్దు అయినట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

అపరాలపై తెగుళ్ల దాడి..!



- మినుము, పెసర రైతులు గగ్గోలు
- వైరస్, తెగుళ్లతో దెబ్బతింటున్న పంట
- దాదాపు 40 వేల ఎకరాల్లో అపరాల సాగు
- ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని అన్నదాత ఆందోళన
- వ్యవసాయాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మినుము, పెసర, కందులు, ఉలవలు వంటి అపరాల పంటలపై వైరస్ తెగుళ్లు దాడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పంట చివరి దశలో దెబ్బతినే పరిస్థితి ఏర్పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడి ఖర్చు అవ్వడంతో తమ పరిస్థితి ఏంటన్న భయం అన్నదాతను వెంటాడుతోంది. జిల్లాలో ఏలూరు, పెదపాడు, దెందులూరుతోపాటు ఇతర మండలాల్లోనూ రైతులు పెద్దఎత్తున అపరాల సాగు చేపట్టారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పెసర పంట 15,847 ఎకరాల్లో, మినుము సాగు 23,437 ఎకరాల్లో, 23 ఎకరాల్లో కంది, 156 ఎకరాల్లో ఉలవ, ఇతర పంటలు కలుపుకుని మొత్తం దాదాపు 39,475 ఎకరాల్లో రైతులు అపరాల సాగుచేశారు. పశ్చిమలోనూ పలుచోట్ల అపరాల సాగు సాగుతోంది. ప్రస్తుతం పంటంతా పూత, పిందె దశలో ఉంది. దాళ్వా లేకపోవడంతో పెదపాడు వంటి మండలాల్లో అపరాల సాగుపైనే రైతులు పూర్తిగా ఆధారపడిన పరిస్థితి నెలకొంది. పూత, పిందె దశలో వైరస్, తెగుళు అపరాల పంటలను నాశనం చేస్తున్నాయి. ఆకులు ఎండిపోయి మొక్క దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. తెగుళ్లను అరికట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పెద్ద ఎత్తున పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైతులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పురుగుమందు పిచికారీ చేయాలంటే ఎకరాకు ప్రతిసారీ రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకూ అవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ దశలో తెగుళ్ల దాటితో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ అవుతోందని రైతులు చెబుతున్నారు. దిగుబడి సరిగ్గా రాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఏలూరు రూరల్‌లోని మాదేపల్లి, లింగారావుగూడెం గ్రామాల్లో అపరాల పంటలపై వైరస్, తెగుళ్ల మరింత ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు సంబంధించి రైతులకు సరైన సూచనలు ఇవ్వాల్సిన స్థానిక వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెగుళ్ల నివారణకు సంబంధించి అధికారులు రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తెగుళ్లతో పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది.


కౌలురైతులపై తీవ్ర ప్రభావం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. పంటలు దెబ్బతింటే కౌలురైతులే తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ కారణంగానే కౌలురైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్‌లో తుపాన్లు, భారీ వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. పంట నష్టపరిహారం మాత్రం భూ యజమానుల ఖాతాల్లోకి చేరింది. ఇప్పుడు అపరాల సాగులోనూ కౌలురైతులే అత్యధికంగా ఉన్నారు. పంట దెబ్బతింటే కౌలు రైతులు నష్టపోనున్నారు. కౌలు రైతులకు అండగా ఉంటామంటూ అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ వారికి అనుకూలంగా ఏ ఒక్క నిర్ణయమూ తీసుకోలేదు. కొత్త కౌలుచట్టం తెస్తామని హామీ ఇచ్చిన పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఏ ఒక్కసాయమూ కౌలురైతులకు అందడం లేదు. అపరాల రైతుల సమస్యలపై అధికారులు దృష్టిసారించి ఆదుకోవాల్సి ఉంది.

అపరాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంటకు సాగునీరందక పెద్దఎత్తున రైతులు అపరాల సాగు చేపట్టారు. తెగుళ్లకు సంబంధించి పురుగుల మందులకు రూ.వేలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. పూత, పిందె దశలో పంటలు ఎండిపోతున్నాయి. ఎకరాలకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. నష్టపోతున్న అపరాల రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నాం.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంతోనే..

సాగునీటి సమస్యకు పరిష్కారం

మంత్రి పార్థసారధి, ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ముసునూరు

చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంతోనే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హౌసింగ్, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ముందుగా ముసునూరు మండలం కాట్రేనిపాడులో డిస్ట్రిబ్యూటీ కమిటీ ఛైర్మన్ ఆర్.బాలకృష్ణ పుట్టినరోజు వేడుకల్లో మంత్రి పార్థసారథి, పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి బాలకృష్ణ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతుల విజ్ఞప్తి మేరకు కాట్రేనిపాడు సమీపంలోని ఎన్ఎస్‌పి మడిచర్ల మేజర్ పరిధిలోని మైనర్ కాలువను మంత్రి పార్థసారథి, ఎంపీ మహేష్‌తో కలిసి పరిశీలించారు. మైనర్ కాలువను 300 మీటర్ల మేర తవ్వకుండా 30 ఏళ్ల పైగా ఇద్దరు రైతులు అడ్డుకుంటున్నారని, తద్వారా దిగువున తొమ్మిది గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు సాగర్ జలాలు సరఫరా జరగకపోవడంతో పంట నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం మంత్రి పార్థసారథి, ఎంపీ మహేష్ కుమార్ స్పందించి రెవెన్యూ, ఎన్ఎస్‌పి అధికారులతో మాట్లాడారు. మైనర్ కాలువ తవ్వకానికి అవరోధంగా ఉన్న పరిస్థితులపై సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారంపై తమవంతు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ కనీసం సాగర కాలువల మరమ్మతులను గత వైసిపి ప్రభుత్వం విస్మరించడంతో ముళ్ల పొదలు, తుప్పలు పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందని పార్థసారథి ఆరోపించారు. సాగర కాలువల మరమ్మతులు చేపట్టేందుకు తక్షణం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడానికి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాట్రేనిపాడు సమీపంలోని మైనర్ కాలువ సమస్య పరిష్కారానికి ఎంపీతో కలిసి తన వంతు కృషి చేస్తానని పార్థసారథి రైతులకు హామీ ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ విషయంలో గత వైసిపి ప్రభుత్వం వ్యవహరించిన తీరును మంత్రి పార్థసారథి తప్పు పట్టారు. ఈ పథకం నిర్మాణం పూర్తి చేయడం ద్వారా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం విషయంలో గత వైసిపి ప్రభుత్వం వ్యవహరించిన నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం సాగునీటి కోసం రైతులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసినందుకు సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన మరుక్షణం చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. అనంతరం వెలుగు శాలల్లో జరిగిన అంకమ్మ తల్లి ఆలయం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమంలో మంత్రి పార్థసారథి, ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోటా వీరబాబు, నాయకులు దేవినేని దళారం, అట్లూరి రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎల్‌పిజి సేల్స్ జనరల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ ద్వారా పరిశుభ్రమైన పర్యావరణం నినాదంతో ఆదివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన నడక నిర్వహించారు. స్థానిక ఇం డోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయిల్ కంపెనీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ ద్వారా పరిశుభ్రమైన పర్యావరణం నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా పౌర సరఫరా అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రతి ఒక్కరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకు చుటకు ఉచితంగా దీపం, ఉజ్వల గ్యాస్ ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. దీపం 2 కింద సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు దిగ్విజయంగా పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంవి.రామ్‌ప్రసాద్, సహాయ పౌర సరఫరా అధికారి వై.ప్రతాప్ రెడ్డి, పౌర సరఫరా అధి కారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ గ్యాస్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా టీ20 మ్యాచ్

పోలీసు, మీడియా మధ్య స్నేహపూర్వక క్రికెట్

ప్రెస్ జట్టుపై ఎస్‌పి జట్టు విజయం

మరిన్ని మ్యాచ్‌లు నిర్వహించేందుకు సిద్ధం : ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఎస్‌పిని అభినందిస్తున్న ఇరు జట్లు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు, మీడియా మధ్య సన్నిహిత భావం పెంచేందుకు, క్రికెట్ క్రీడను ప్రోత్సహించేందుకు స్నేహపూర్వక క్రికెట్ ఆటను రెండు జట్ల మధ్య నిర్వహించామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. మీడియాలో క్రీడాకారులు పోలీసుల క్రీడాకారులు అద్భుతంగా ఆడారని, వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు. పోలీసు, మీడియా మధ్య సన్నిహిత భావం పెంచేందుకు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెపొందించేందుకు ఆదివారం పోలీసు శాఖ మీడియా సంయుక్తంగా స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను ఆశ్రమం క్రికెట్ క్రీడా మైదానంలో టీ20 మ్యాచ్ ఏర్పాటు చేశారు. పోలీస్ జట్టు పేరు ఏలూరు ఎస్‌పి జట్టు కాగా మీడియా పేరు ఏలూరు ప్రెస్‌జట్టుగా పెట్టారు. ఎస్‌పి జట్టుకు ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఏలూరు ప్రెస్ జట్టుకు సంజయ్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించారు. మ్యాచ్ ఉదయం 10.20 గంటలకు మొదలైంది. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌పి జట్టు 20 ఓవర్లలో 160 పరుగులకు ఒక్క వికెట్ కోల్పోయింది. కాగా ఏలూరు ఎస్‌పి జట్టులో జట్టు కెప్టెన్ ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ 50 బంతుల్లో 56 పరుగులు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆట తీరు పోలీసు జట్టులో మిగిలిన ఆటగాళ్లకు స్ఫూర్తినిచ్చింది. ఆదిప్రసాద్ 32 బంతుల్లో 50 పరుగులు చేశారు. ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ 30 బంతుల్లో 35 రన్స్ సాధించారు. ఏలూరు ఎస్‌పి జట్టు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఇక బౌలింగ్ విషయానికొస్తే ఎస్‌పి జట్టు కెప్టెన్ ప్రతాప్ శివ కిషోర్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేశారు. ఆయన నాలుగు ఓవర్లలో నాలుగు వికెట్లను తీశారు. ఎస్ఐ మదీనా భాషా రెండు ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్‌ను తీశారు. 20 ఓవర్లలో 160 పరుగులకు ఎస్‌పి జట్టు ఒక వికెట్‌ను కోల్పోయింది. ఏలూరు ప్రెస్ జట్టుకు 161 పరుగుల టార్గెట్‌ను ఎస్‌పి జట్టు ఇచ్చింది. ఏలూరు ప్రెస్ జట్టు ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా మైదానంలోకి దిగిన కృష్ణంరాజు (ఆర్ఆర్.పేటరాజు) బాబి (బాబీస్) మైదానంలో గట్టి పోటీని ఎస్‌పి జట్టుకు ఇచ్చారు. వీరి ఆట పేరు మిగిలిన ఆటగాళ్లలో స్ఫూర్తి నింపింది. ఏలూరు ప్రెస్ జట్టు ఆటగాళ్లు వీరోచితంగా పోరాడారు. అయినప్పటికీ ఎస్‌పి బౌలింగ్ ధాటికి ఏలూరు ప్రెస్ జట్టు నాలుగు వికెట్లను కోల్పోయింది. ఎస్ఐ మదీనా భాషా బౌలింగ్‌లో రెండు వికెట్లను కోల్పోయింది. చివరకు ఏలూరు ప్రెస్ జట్టు 20 ఓవర్లలో 97 పరుగులు చేసి ఏడు వికెట్లను కోల్పోయింది. 63 పరుగుల తేడాతో ఏలూరు ఎస్‌పి జట్టు విజయాన్ని సాధించింది. 56 పరుగులు చేసి, నాలుగు వికెట్లు తీసిన ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు రెండు వరించాయి. మ్యాచ్ అనంతరం రెండు జట్లు కరచాలనం చేసుకుని ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. ఈ మ్యాచ్‌కు మెయిన్ ఎంపైర్‌గా రవీంద్ర వ్యవహరించగా లెగ్ ఎంపైర్‌గా సాగర్ వ్యవహరించారు. చాలాకాలం తర్వాత స్నేహపూర్వకమైన క్రికెట్ ఆట పోలీసు, ప్రెస్ ఎధ్య జరగడంతో అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరిన్ని మ్యాచ్‌లను ఆడేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎస్‌పి తెలిపారు. మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన చిన్నారులకు మిఠాయిలు పంచారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎస్‌పి

బావాయిపాలెంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - నిడమర్రు



మృతుడు ఏసు (ఫైల్‌ఫొటో)

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బావాయిపాలెంలో దారుణం చోటుచేసుకుంది. బావాయిపాలేనికి చెందిన మజ్జి ఏసు (26)ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి కిరాతకంగా హతమార్చి మృతదేహాన్ని కాపవరం కాలువలో పడేశారు. మృతుడి కుడి చేయి లేదు. నిడమర్రు సిఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఏలూరు నుంచి పోలీసు జాగిలాన్ని రప్పించారు. మృతుడు భార్య శ్రీవల్లి ఏడు నెలల గర్భిణీ. ఏసు ఉండి మండలం కలిగొట్లలోని చేపల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి రాలేదు. ఉదయం స్థానికులు కాలువలో ఏసు మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

సత్యసాయి తాగునీరు అందించాలి

20 రోజులుగా గ్రామస్తుల ఇబ్బందులు

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో గత 20 రోజులుగా గోదావరి సత్యసాయిబాబా తాగునీరు రాకపోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రెడ్డి గణపురం మాజీ ఎంపిటిసి-1, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. ఈ మేరకు రెడ్డి గణపురం శివారు డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు సెంటర్‌లో ఉన్న సత్యసాయిబాబా వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రెడ్డి గణపవరం పంచాయతీ కార్యదర్శికి 20 రోజులుగా నీళ్లు రావడంలేదని సమస్య వివరించామని చెప్పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ గోదావరి సత్యసాయిబాబా వాటర్ బాధ్యత తమది కాదని ఆర్‌డబ్ల్యూఎస్ చూసుకుంటారని సమాధానం చెప్పారన్నారు. మరి పంచాయతీలో తాగునీరు ఎవరు చూస్తారని, పంచాయతీ కార్యదర్శివారా, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన వారా అని ప్రశ్నించారు. ఒకరిపై ఒకరు వంతులేసుకుని ప్రజలకు నీరు లేకుండా చేస్తున్నారన్నారు. వేసవికాలం ప్రారంభమవుతుందని, అప్పుడే ఎండలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు దాహంతో అల్లాడుతున్నారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలగజేసుకొని సత్యసాయిబాబా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యసాయిబాబా వాటర్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాల్లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. సత్యసాయిబాబా వాటర్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులకు వెంటనే జీతాలు ఇచ్చి వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రజల పట్ల నిర్లక్ష్యం వీడి రెడ్డిగణపవరం పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. లేకపోతే రెడ్డిగణపవరం సచివాలయం వద్ద నిరసన దీక్ష చేస్తామని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు పి.దుర్గారావు, వి.వేణు, కె.అరుణ్, బి.మరియన్న, కొల్లి బుచ్చమ్మ, బి.మరియమ్మ, రాము పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గజానికో గుంత.. ప్రజల చింత..!

అధ్వానంగా నూజివీడు - ఏలూరు రోడ్డు

2019 ప్రారంభించిన పనులు

ముందుకెళ్లని వైనం

ప్రమాదాల బారిన వాహనదారులు

పట్టించుకోని అధికారులు



గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నుంచి వయా ముసునూరు, గోపవరం, బలివే, వేల్పుచర్ల గ్రామాల మీదగా వేళ్లే ఆర్అండ్‌బి రహదారి గోతులమయంగా తయారైంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సింగల్ రోడ్డును రెండు లైన్ల రహదారిగా నిర్మించేందుకు గత ప్రభుత్వం 2019లో రూ.47.20 కోట్ల అంచనా లతో హైదరాబాద్‌కు చెందిన రిత్విక్, పృధ్వి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అప్పగించింది. అప్పటినుంచి నేటి వరకూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం మరింత గోతులమయంగా తయారై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రారంభ దశలో రోడ్డు పనులు శరవేగంగా చేపట్టారు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. నేటివరకు ఆ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి కళ్యాణ ఉత్సవాల నిమిత్తం మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రజలు వచ్చే అవకాశం ఉంది. అయినా నేటికీ ఆ రోడ్డు పనులు మొదలు పెట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో బైక్‌పై ప్రయాణించేవారు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లాలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణనష్టం కూడా సంభవించింది. అయినా అధికారులు స్పందించడంలేదని, పాలకులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి శాఖాధికారులు, రాజకీయ నాయకులు రోడ్డు నిర్మించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం


ఎన్.జమలయ్య, ముసునూరు



రోడ్డు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాకపోవడానికి రోడ్లను ఏమాత్రం పట్టించుకోకపోవడం కూడా ఒక కారణం. ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోకపోతే అదే గతి పడుతుంది.

రోడ్డును నిర్మించాలి

గూడపాటి అజయ్‌కుమార్, కాట్రేనిపాడు




ముసునూరు నుంచి కాట్రేనిపాడు, గోపవరం మధ్యలో భారీ గుంతలు ఉన్నాయి. వాహనాల్లో ప్రయాణించే కన్నా నడవడమే మేలు అనేలా రహదారి పరిస్థితి ఉంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం రోడ్లను పట్టించుకుని నిర్మించాలని కోరుతున్నాం.

బాధితులకు సిపిఎం సాయం

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

అంతర్వేదిగూడెంలో అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైనవారికి సిపిఎం నాయకులు సాయం అందించారు. శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో నిరాశ్రయులైన రాంపండు కుటుంబానికి సిపిఎం బుట్టాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో సాయం అందించారు. రూ.ఐదు వేల నగదు, రైస్ ప్యాకెట్ అందించారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలోని సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం ముత్యాలరావు, పోలోజు నాగేశ్వరరావు, ఉడతా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న సిపిఎం నేతలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ప్రచారానికి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ఘర్షణలు, గొడవలు నిరోధించడమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముఖ్య ఉద్దేశ్యం. ఎన్నికల ప్రచారంలో పరస్పర ద్వేషాన్ని కలిగించేలా, కులాలు, జాతులు, మతాలు, భాషల మధ్య ఉద్రిక్తని కలిగించే కార్యకలాపాలు నిర్వహించకూడదు. ఓటును అభ్యర్థించేటప్పుడు కుల, మతపరమైన భావాలు వ్యక్తం చేయకూడదు. ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ఆరాధన ప్రదేశాలను వేదికగా ఉపయోగించకూడదు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగ్ పూర్తి కావడానికి 48 గంటల కాలంలో పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించడం, పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం వంటివి అవినీతికరమైన, శిక్షించదగిన చర్యగా ఉంటుంది. ఎన్నికల ప్రచారం కోసం జెండాలు, బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, గోడలపై రాతలు రాయడం వంటివి సదరు హక్కుదారుల అనుమతి లేకుండా చేయకూడదు. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ సభల నిర్వహణపై ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సభల్లో లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందుగా సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందాలి.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని ఎపిగుంట పంచాయతీలోని సర్వే నెంబర్ 500లో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా నాయకులు టివిఎస్.రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతో కాలంగా సాగులో ఉన్న రైతుల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి దాత విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఓ దాత నగదు విరాళం అందించారు. గుడివాడకు చెందిన రంజిత్‌కుమార్, వెంకట లావణ్య దంపతుల కుమారుడు సాయన చరిత్ స్వామివారి నిత్యాన్నదానానికి రూ.11,116 నగదును ఆలయానికి అందించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణి గంగా శ్రీదేవి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎపి ట్రాన్స్ కో 220 కెవి నూజివీడు కామవరపుకోట లైన్ మార్పు పనుల నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మరమ్మతు పనులు జరుగుతాయి. ఈ నేపథ్యంలో 220 నూజివీడు ఉపకేంద్రం పరిధిలో ఒక లైన్‌లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్ కో ఇఇ ఎస్.కోటేశ్వరరావు, ఆపరేషన్ ఇఇ ఎ.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే నూజివీడు 220 కెవి ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

నాలుగు బైక్‌లు, బంగారు గొలుసు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఒక నేరంలో నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా అతను పలు నేరాల్లో నిందితుడిగా ఉన్నట్లు భీమడోలు పోలీసులు గుర్తించి అతడితో పాటు మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతనితో పాటు ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన అక్కల రామచంద్రరావు భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామంలోని ఓ వ్యక్తికి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో సాగు చేసే పొలంలో ఉన్న మోటార్ షెడ్డులో తాను వినియోగించే ద్విచక్రవాహనాన్ని గత నెల 28వ తేదీన ఉంచి తాళాలు వేసి వ్యక్తిగత పనులపై చింతలపూడి మండలంలోని తన స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 13వ తేదీన పొలానికి వచ్చి చూడగా షెడ్డు తాళాలు పగలగొట్టి ఉండగా అందులో ఉన్న ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా భీమడోలు సిఐ విల్సన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని వంగాయగూడెం ప్రాంతానికి చెందిన పాత నిందితుడు వాసే రాజు (సంసోను) భీమడోలు మండలం గొలుసులగేటు రోడ్డులో నివాసం ఉండే మరో నిందితుడు ఎర్రంశెట్టి పవన్‌కుమార్ (పవన్) సాయంతో ద్విచక్ర వాహనాన్ని దొంగలించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరిని భీమడోలులోని పవన్ కుమార్ ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీరు ఈ ఒక్క ద్విచక్రవాహనం దొంగతనమే కాకుండా పలు ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వీటిలో భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అపహరించిన మూడు ద్విచక్ర వాహనాలు, ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో అపహరించిన ఒక ద్విచక్ర వాహనం మొత్తం నాలుగు బైక్‌లను వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు నగరంలో ఒకటో పట్టణ పరిధిలో కొన్నిరోజుల క్రితం గుడికి వెళ్లి ఇంటికి వెళ్తున్న ఓ వృద్ధురాలు మెడలో ఆరు కాసుల బంగారు గొలుసును చోరీ చేసింది వీరిద్దరేనని గుర్తించారు. వృద్ధురాలి మెడలో దొంగిలించకపోయిన గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. ఆ గొలుసుని కూడా పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వాసేరాజు (సంసోను)పై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 కేసులు ఉన్నాయని తెలిపారు. ఇతనిపై సస్పెక్ట్ షీట్ కూడా ఉందని తెలిపారు. అతని స్నేహితుడైన పవన్‌కుమార్ సహాయంతో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. వీరిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కేసును అత్యంత పరిజ్ఞానంతో ఛేదించిన భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ బాజీ, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులను డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు ఆశ్రం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద చైన్ స్నాచర్స్ యథేచ్ఛగా మహిళల మెడల్లో గొలుసులు తెంచుకుపోతున్నారు. శనివారం పాలగూడేనికి చెందిన ఒక మహిళ తన కుమారుడి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసు తెంచుకుపోయారు. వారు బండి దిగేలోపే అక్కడినుంచి పరారయ్యారు. సదరు మహిళ భర్త మొన్ననే అప్పు చేసి మరీ గొలుసు చేయించి భార్య మెడలో వేశానని వాపోతున్నాడు. బాధిత మహిళ లబోదిబోమంటోంది. గతంలోనూ ఇక్కడ ఒక మహిళ మెడలో గొలుసు తెంచుకుపోగా ఆమె గొంతుకు తీవ్ర గాయమైనట్లు సమాచారం. మరికొన్ని సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఇంత కీలక ప్రాంతంలో పోలీస్ నిఘా కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించిన వ్యక్తిపై కర్రతో దాడి

ముదినేపల్లి : మా అక్కతో ఎందుకు మాట్లాడుతున్నావు అంటూ ప్రశ్నించిన తమ్ముడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని పెయ్యేరు శివారు రంగాపురం సాయిబాబా ఆలయం వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెయ్యేరుకు చెందిన గురజ శంకర్ సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. శంకర్ అక్క గడడేసి శిరీష భర్తతో గొడవ పడి వచ్చి కొంతకాలంగా తమ్ముడి ఇంటి వద్దనే ఉంటుంది. శిరిష ముదినేపల్లి గ్రామానికి చెందిన ఉప్పల రాజా వ్యక్తితో సహజీవనం చేస్తుంది. ఈ విషయం శంకర్‌కు తెలిసి రాజాను పలుమార్లు మందలించాడు. అయిన రాజా పద్ధతి మార్చుకోలేదు. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో శంకర్ అక్క సదరు ఉప్పల రాజాతో రంగాపురం వద్ద ఉండగా శంకర్ చూసి ఎందుకు పెళ్లయిన మా అక్కతో తిరుగుతు న్నావని ఉప్పల రాజాను కేకలు వేయగా, ఆగ్రహంతో రాజా కర్రతో శంకర్ కుడి భుజం పై, తలపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన మేనల్లుడు రాకేష్‌ను కూడా రాజా కొట్టాడు. శంకర్‌ను బంధువులు గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి ఆదివారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చాప కింద నీరులా నాటుసారా తయారీ..!

దాడులు చేస్తున్నా నియంత్రణలోకి రాని వైనం
పూర్తిస్థాయిలో అరికట్టాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా సారా అమ్మకాలు తగ్గని పరిస్థితి. కేసులు నమోదు చేసినా నాటుసారా తయారీ కేంద్రాలు కట్టడి కావడంలేదు. గత ప్రభుత్వం హయంలో మద్యం ధరలు పెరగడంతో సారా తయారీ కేంద్రాలు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం మద్యం ధరలు కొంతమేర తగ్గినా నాటుసారా నియంత్రణలోకి రాలేదు.

చింతలపూడి, లింగపాలెం, కంచనగూడెం, దేశవరం, కాంతంపాలెం, తల్లర్లపల్లి, రేచర్ల, సుద్దీంపేట వేములపల్లి, ప్రగడవరం, ఊటసముద్రం, గణిజర్ల నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలు అధికంగా ఉన్నాయి. అక్కడ ఎక్కువ సారు ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. నాటుసారా, బెల్లపు ఊట అధికమొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో నాటుసారా ఎక్కువగా తయారీ అవుతుందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా రేచర్ల, తల్లర్లపల్లి, కంచనగూడెం, నామవరం, నాగిరెడ్డిగూడెం గ్రామంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువగా ఎక్సైజ్ దాడులు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్సైజ్ డిపార్టెమెంట్ నూతనంగా ఏర్పడి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి పరిధిలోని నాలుగు మండలాల్లో దాడులు చేశారు. ఇప్పటివరకు మొత్తం 232 నాటు సారా కేసులు నమోదు చేసి 201 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 709 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 18 వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పది వాహనాలను పట్టుకున్నారు. 43 బెల్ట్ షాపు కేసులు నమోదు చేసి దానిలో 77.76 లీటర్ల డ్యూటీ పైడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 187 పాత నాటు సారా కేసుల్లో నిందితులైన వారిని సంబంధిత మండల మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. 314 కేజీల బెల్లాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. రెండు బైండోవర్ కేసుల్లో నిందితులు బాండ్ ఉల్లంఘించిన విషయంలో టి.నరసాపురం మండల మెజిస్ట్రేట్ వారు రూ.20 వేలు అపరాధ రుసుం, చింతలపూడి మండల మెజిస్ట్రేట్ వారు రూ.75 వేలు అపరాధ రుసుం విధించారు. దీనిని బట్టి నాటుసారా తయారీ, అమ్మకాలు ఏ రీతిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

చింతలపూడి మండలమంటే నాటు సారా తయారీకి పెట్టింది పేరని జిల్లా అధికారులకు తెలిసిన విషయమే. తెలంగాణ, కృష్ణా జిల్లాలకు ఇక్కడ నుంచే సరఫరా జరుగుతుందనే నానుడి ఉంది. నాటుసారా స్థావరాలపై అధికారులు దాడులు చేసిన సమయంలో వారికి అమ్మోనియం దొరుకుతుంది. దీంతో సారా తయారీలో అమ్మోనియం వాడుతున్నట్లు తెలుస్తోంది.



నాటుసారా స్థావరంపై దాడి చేసిన పోలీసులు (ఫైల్)

సారా తయారీకి బెల్లం ఎక్కడ నుంచి వస్తుంది?

నాటుసారా తయారీకి బెల్లం ఎక్కడ నుంచి వస్తుందనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. దుకాణాల్లో అంత స్టాక్ ఎలా ఉంచుతున్నారని ఎవరికీ అర్థం కాని విషయంగా ఉంది. సారా తయారీకి విచ్చలవిడిగా అమ్మే బెల్లం దుకాణాలపై దాడులు ఎందుకు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దుకాణాల్లోనే కాకుండా గోదాముల్లో, ఇంటి వద్ద, బంధువుల ఇళ్లలో నిల్వ ఉంచి నాటుసారా వ్యాపారులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణాల్లో పలుమార్లు దాడులు చేసి బెల్లం వ్యాపారులను తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లాన్ని అదుపు చేయాలని, విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అమ్మోనియంపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. నాటుసారాను అరికట్టాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం, కామవరపుకోట నాలుగు మండలాలకు గతంలో 12 మంది సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం నాలుగు మండలాలకు కలిపి నలుగురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉండడంతో ఎక్సైజ్ అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సిబ్బంది కొరతతో దాడులు చేయడానికి కూడా ఇబ్బందిగా మారుతుంది. సిబ్బంది కొరత తీరితేనే సారా తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో నియంత్రించడానికి సాధ్యపడుతుంది. ఆ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. అంతేకాకుండా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు చొరవ చూపి బెల్లాన్ని ఏ విధంగా సరఫరా చేస్తున్నారో తెలుసుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇపిటిఎఫ్ అధికారులు సమన్వయంతో సారాను పూర్తిగా నిర్మూలించాలని వేడుకుంటున్నారు.

బెల్లం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

పి.అశోక్, చింతలపూడి ఎక్సైజ్ సిఐ

నాటుసారా స్థావరాలపై నిరంతరం దాడులు చేస్తూనే ఉన్నాం. సారా తయారీ కేంద్రాల వద్ద బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్నాం. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు బెల్లం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి. బెల్లం అమ్మే దుకాణదారులపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. సారాను పూర్తిగా నియంత్రించడానికి కృషి చేస్తాం.

పన్నులు చెల్లిస్తే అభివృద్ధి ముందుకు

'ప్రజాశక్తి' ఇంటర్వ్యూలో న్యూజివీడు డిఎల్‌పిఒ ఎంపిఎన్.సుందరి



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజలు సకాలంలో బాధ్యతాయుతంగా పన్నులు చెల్లిస్తే గ్రామాలు వేగవంతంగా అభివద్ధి చెందుతాయని, అలాగే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచాలని నూజివీడు డివిజనల్ పంచాయతీ అధికారిణి ఎంపిఎన్.సుందరి తెలిపారు. సంపద సృష్టి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కషి చేస్తామని, గ్రామాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ వంటి సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆమె మాట్లాడారు.

ప్రశ్న : మీ కార్యాలయ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

డిఎల్‌పిఒ : నూజివీడు డివిజన్ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, లింగపాలెం, చింతలపూడి.

ప్రశ్న :15వ ఆర్థికసంఘం నిధులు 2024-2025 సంవత్సరానికి గాను ఎంత వచ్చాయి?

డిఎల్‌పిఒ : 15వ ఆర్థికసంఘం నిధులు కేంద్రం నుండి నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాకు వెళ్తాయి.

ప్రశ్న : 15వ ఆర్థిక సంఘం నిధులు ఏయే పనులకు కేటాయిస్తారు?

డిఎల్‌పిఒ : గ్రామపంచాయతీ మార్గదర్శకాలను అనుసరించి త్రాగునీరు నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, రోడ్లు, కరెంటు చార్జీలకు, సిబ్బంది వేతనాలకు వాడతారు.

ప్రశ్న : గ్రీన్ అంబాసిడర్ ఎంతమంది జనాభా చొప్పున నియమిస్తారు?

డిఎల్‌పిఒ : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామంలో వెయ్యి మంది జనాభా లేదా 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్ ను కచ్చితంగా ఏర్పాటు చేయాలి,

ప్రశ్న : నూజివీడు డివిజన్లో ఎంతమంది పంచాయతీ కార్యదర్శుల ఉన్నారు. కార్యదర్శుల కొరత ఏమైనా ఉందా?

డిఎల్‌పిఒ : నూజివీడు డివిజన్ పరిధిలో ఆరు మండలాలకు 129 గ్రామ పంచాయతీలు ఉన్నాయి, ఈ పంచాయతీలకు 148 మంది కార్యదర్శులు ఉండాలి. ప్రస్తుతం 102 మంది పనిచేయుచున్నారు. మిగిలిన వారిని నియమించాల్సి ఉంది.

ప్రశ్న : గ్రామ పంచాయతీల్లో తనిఖీలు ఏమైనా చేస్తున్నారా?

డిఎల్‌పిఒ : ఇఒపిఆర్‌డి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పకుండా తనిఖీ చేస్తారు. డి ఎల్ పి ఓ సంవత్సరానికి ఒకసారి పంచాయతీలను తనిఖీ చేస్తారు, అంతే కాక ఎవరైనా గ్రామ పంచాయతీ పరిపాలనలో సమస్యలపై విచారణ కోరుతూ ఫిర్యాదు చేస్తే తక్షణమే పంచాయతీలకు వెళ్లి రికార్డులు పరిశీలించి ఫిర్యాదులను పరిష్కరిస్తాం.

ప్రశ్న : మీ పరిధిలోని గ్రామపంచాయతీలలో ప్రధానంగా ఏయే సమస్యలను గుర్తించారు?

డిఎల్‌పిఒ : ప్రధానంగా శానిటేషన్, వీధి దీపాల సమస్య ఉన్నాయి. 2018-2019 సంవత్సరంలో ఎల్‌ఈడీ లైట్లు వేశారు. మూడవ లైన్ వెయ్యని కారణంగా వీధి దీపాలు పగలు రాత్రి కూడా వెలుగుతున్నాయి. ఆర్థిక స్తోమత ఉన్న గ్రామపంచాయతీలు మూడవ లైను వేసుకుంటున్నాయి. ఆర్థిక స్తోమత లేని పంచాయతీలకు స్విచ్లు ఏర్పాటు చేసుకోవాలని తెలపడం జరిగింది.

క్రైస్తవుల సంక్షేమానికి రూ.150 కోట్లు మంజూరు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి
సండే స్కూల్ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో సమతా కాలనీలో ఉన్న సెయింట్ జాన్స్ సిఎస్ఐ చర్చి ప్రాంగణంలో నిర్మించే సండే స్కూల్ నూతన భవనానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందన్నారు. జెరుసలేము యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని, క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అందుకు కావాల్సిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గతంలో 255 క్రైస్తవ మందిరాలకు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం కూడా తమదేనన్నారు. గతంలో క్రిస్టియన్ సోదరులకు సిఎం చంద్రబాబు అనేక సంక్షేమ ఫలాలు ఇచ్చారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలు సహకరించాలన్నారు. క్రీస్తు వారి ఆశీస్సులతో పాడి పంటలు బాగా పండి రాష్ట్ర ప్రజానీకం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, చర్చి ఫాదర్లు, సిస్టర్లు, చర్చి పెద్దలు ఇళయరాజా, రమేష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.




శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారధి

వైసిపి నేత రాజబాబు మృతి

పలువురు రాజకీయ నేతల సంతాపం

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెలికాని రాజబాబు శనివారం మృతి చెందారు. హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్ బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన సిహెచ్.పోతేపల్లిలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సందర్శనర్థం ఉంచారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిగా, ఏదైనా సమస్య ఉంటే పోరాడి సాధించేవరకు నిద్రపోని వ్యక్తిగా ఆయనకు పేరు పొందారని పలువురు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో, తెలుగుదేశం పార్టీలో, వైసిపిలో పని చేసిన అనుభవం ఉన్న వ్యక్తి ఆయన అని కొనియాడారు. చుట్టుపక్కల ఉన్న నాలుగు మండలాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు ఆయనకు ఉన్నారన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, కవురు శ్రీనివాస్, కంభంపాటి విజయరాజు, ముళ్లపూడి బాపిరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు ఎంపిటిసిలు, సర్పంచులు రాజబాబు మృతదేహాన్ని సందర్శించారు. సీనియర్ నాయకుడిని కోల్పోయామని మాజీ సిఎం జగన్ ట్వీట్ చేశారు.



రాజబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాజకీయ నేతలు

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, కొమ్మాయి చెరువుగట్టు కు చెందిన పట్టా ఉమా మహేశ్వరి, W/o పట్టా రమేష్ అను నేను నా యొక్క **పాస్‌పోర్టు నెం. Y7724497** గల పాస్‌పోర్టు జిరాక్స్ తీయించుకొను నిమిత్తం నా భర్త రమేష్ మోటర్ సైకిల్ పై జిరాక్స్ సెంటర్ కు వెళ్ళి చూడగా ప్లాస్టిక్ కవర్ లో పెట్టుకున్న నా యొక్క పాస్‌పోర్టు మార్గ మధ్యలో పడిపోయింది. చుట్టుప్రక్కల ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సు కు తెలియజేయగలరు.

పట్టా ఉమా మహేశ్వరి
W/o పట్టా రమేష్
D.No. 1-6-25
కొమ్మాయి చెరువుగట్టు,
తణుకు, ప.గో.జిల్లా
సెల్: 90595 46408

రాజకీయ ప్రకటనలకు ఎంసిఎంసి ఆమోదం తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ(ఎంసిఎంసి) నుంచి ముందస్తు ఆమెదం పొందాల్సి ఉంటుంది. పట్టభధ్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథంలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసిఎంసి కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. పెయిడ్ న్యూస్ రాజకీయ ప్రకటనలను పరిశీలించేందుకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వారు ఎంసిఎంసి కమిటీని నియమించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెండు రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఇసి నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఎంసిఎంసి మోనటరింగ్ సెల్‌ను ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు.

వేల్పుచర్లను మరింత అభివృద్ధి చేస్తా

అంకమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

వేల్పుచర్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. వేల్పుచర్ల గ్రామంలో ఉన్న అంకమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. వేల్పుచర్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. వచ్చే ఏడాది అమ్మవారి సన్నిధి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో అమ్మవారి సన్నిధిని సకల సదుపాయాలు, సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో 2014- 2019 ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లకు కూడా డబ్బులు ఇచ్చే బాధ్యత తనదన్నారు. గ్రామంలో ఒక్క పూరిల్లు లేకుండా వచ్చే మార్చి నుంచి రూ.3.50 లక్షలతో పక్కా ఇల్లు కట్టిస్తానని మంత్రి తెలిపారు. అర్హులందరికీ పక్కా ఇళ్లు, పెన్షన్లు ఇప్పించే బాధ్యత తనదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలు సహకరించాలన్నారు. మొదటిగా గ్రామ పెద్దలు, భక్తులు, చిన్నారులు భాజా భజంత్రీలు, మేళతాళాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.